ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 304 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 10 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

### హక్కులను రక్షించుకునేందుకు
# దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలి
## తిరువనంతపురంలో మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

**తిరువనంతపురం, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):** ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూసే పేదలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ శుభవార్త చెప్పారు. ఆదివారం కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను రక్షించుకునేందుకు దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ అనేది నినాదం మాత్రమే కాదని.. అది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల స్వప్నమని వెల్లడించారు. తెలంగాణను భారత దేశంలోనే కాదు ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలపాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. 60 ఏళ్ల కలను నెరవేర్చినందున తెలంగాణ ప్రజలు సోనియా గాంధీని ఎంతగానో ప్రేమిస్తున్నారని అన్నారు. ప్రజలు పదేళ్లు అధికారం ఇస్తే బీఆర్ఎస్ నేతలు నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ మాదిరి కాకుండా.. దానికి పూర్తి భిన్నంగా అభివృద్ధే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. దేశంలోని ముంబయి, ఢిల్లీ, బెంగళూర్, చెన్నై వంటి నగరాలతో కాకుండా ప్రపంచంలోని ముఖ్య నగరాలైన న్యూయార్క్, లండన్, సింగపూర్, టోక్యో, సియోల్ వంటి నగరాలతో పోటీపడేలా హైదరాబాద్ ఉండాలనుకుంటున్నామని తెలిపారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం.. ఇది భారతదేశంలోని పూర్తి హరిత, పరిశుభ్రమైన, అత్యుత్తమమైన నగరంగా ఉండనుంది. ప్రపంచంలోని మరే నగరంతో పోల్చుకున్నా ఇది సరైన ప్రణాళిక, జోన్లు ఉన్న నగరంగా ఉండనుంది. అలాగే ఇది మొట్టమొదటి నెట్ జీరో సిటీ అని చెప్పుకొచ్చారు. అంతేకాదు.. ఫ్యూచర్ సిటీలో మేం AI సిటీని నిర్మిస్తున్నాం.. యువత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ..మిగతా 2లో





### ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో
# నెత్తుటేర్లు
## ఇద్దరు జవాన్‌లు, 31 మంది మావోయిస్టులు మృతి

**కొత్తగూడెం ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో నెత్తుటేర్లు పారాయి. పచ్చని ప్రకృతి వనం రుధిరధారలతో ఎరుపెక్కింది. భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య పోరు భీకర రూపం దాల్చింది. ఈ రణరంగంలో 31 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఇద్దరు జవాన్‌లు ప్రాణాలు కోల్పోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఫర్సేఘడ్ ఇలాకాలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో భద్రతాదళాలు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో నేషనల్ పార్క్ ఏరియా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారాసపడి జవాన్‌లపై కాల్పులు జరిపారు. కాసేపటికి తేరుకున్న జవాన్‌లు ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య సుమారు మూడు-నాలుగు సార్లు విడతలవారీగా కాల్పులు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటన స్థలానికి జవాన్‌ల రాక పెరుగుతుండటంతో వారి ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. కాల్పుల అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకొని గాలించారు. ఘటన ప్రాంతంలో 31 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం ..మిగతా 2లో

# తెలంగాణలో తొలి 'జీబీఎస్' మరణం
## 25 ఏళ్ల వివాహిత మృతి




**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):** ప్రస్తుతం దేశంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు జీబీఎస్ (గులియన్ బారీ సిండ్రోమ్). ఇది ఒక నరాల వ్యాధి. ఈ వ్యాధిని మొదటగా మహారాష్ట్రలో గుర్తించారు. ఈ వ్యాధితో తెలంగాణలో తొలి మరణం సంభవించింది. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ సిద్దిపేటకు చెందిన ఓ వివాహిత మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, సిద్దిపేట జిల్లా సిద్దిపేట గ్రామీణ ..మిగతా 2లో

### ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన ట్రక్కు..
# 41 మంది దుర్మరణం



**మెక్సికో, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):** మెక్సికో దక్షిణ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కాంకున్ నుంచి టబాస్కోకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురైంది. ఎస్కార్సెగా నగరానికి సమీపంలో ఈ ట్రావెల్స్ బస్సును ఓ ట్రక్కు ఢీకొనడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 41 మంది సజీవ దహనమయ్యారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం సమయంలో ..మిగతా 2లో

### మణిపూర్ సీఎం బీరెన్ సింగ్
# రాజీనామా
## ఢిల్లీ పెద్దలను కలిసిన వెంటనే!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):** మణిపూర్ సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేశారు. ఇంఫాల్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు ఆయన తన రాజీనామా లేఖను సమర్పించారు. ఆయన వెంట బీజేపీ, ఎన్‌పీఎఫ్ పార్టీలకు చెందిన 14 మంది ఎమ్మెల్యేలు, మణిపూర్ రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎ.శారద, పార్టీ సీనియర్ నేత సంబిత్ పాత్ర ఉన్నారు. ఫిబ్రవరి 10 నుంచి మణిపూర్ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సెషన్‌లో బీరెన్ సింగ్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతామని కాంగ్రెస్ పార్టీ శుక్రవారం రోజు(ఫిబ్రవరి 7న) ప్రకటించింది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు శనివారం రోజు (ఫిబ్రవరి 8న) అధికార ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యేలతో బీరేన్ సింగ్ ముఖ్యమంత్రి ..మిగతా 2లో

### తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల కేసు..
# నేడు సుప్రీంలో విచారణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):** పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ సోమవారం సుప్రీం కోర్టులో విచారణకు రానుంది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఇంతకు ముందు ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపులపై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని గతంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

**కేటీఆర్ రిట్ దాఖలు**

ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కాలయాపన చేస్తున్నారంటూ కేటీఆర్ సుప్రీంకోర్టులో జనవరి 29వ తేదీన రిట్ దాఖలు చేశారు. స్పీకర్ వెంటనే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోర్టును కోరారు. అయితే ఫిరాయింపులపై బీఆర్ఎ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ..మిగతా 2లో



# సీఎం పదవికి ఆతిశీ రాజీనామా
## అమిత్ షా ఇంటికి నడ్డా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):** ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆతిశీ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసిన ఆతిశీ, తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ నేపథ్యంలోనే గవర్నర్ ఢిల్లీ శాసనసభను రద్దు చేశారు. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇంటికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వెళ్లారు. ఢిల్లీ సీఎం విషయంపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. శనివారం వెలువడిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికార ఆమ్ ఆద్మీని బీజేపీ ఓడించింది. ఈ నేపథ్యంలో సీఎం పదవికి ఆతీశీ రాజీనామా చేశారు. ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో జైలు శిక్ష అనుభవించి గతేడాది సెప్టెంబర్‌లో బయటకు వచ్చాక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రజలు మళ్లీ తనను మళ్లీ గెలిపించే వరకూ పదవిలో ఉండను ..మిగతా 2లో



# ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో నెత్తుటేర్లు

మొదటి పేజీ తరువాయి...

నలుగురు జవాన్‌లు గాయపడగా.. వారిలో ఇద్దరు జవాన్‌లు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు జవాన్లను హెలికాప్టర్ సహాయంతో బీజాపూర్ జిల్లా కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. వారికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు.

ఘటనా స్థలంలో ఇంకా కుంబింగ్ ఆపరేషన్ జరుగుతూనే ఉంది. ఈ ఘటనలో మృతి చెందిన 31 మంది నక్సలైట్ల మృతదేహాలతో పాటు ఏకే-47, ఎస్‌ఎల్‌ఆర్, హింసాస్ రైఫిల్, 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్‌తోపాటు పెద్ద ఎత్తున మావోయిస్టులకు సంబంధించిన ఇతర ఆయుధ, వస్తు, సామాగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. కూంబింగ్ జరుగుతుండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు చెప్పారు. ఈ ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.



## హక్కులను రక్షించుకునేందుకు
# దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలి

మొదటి పేజీ తరువాయి...

ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మిస్తున్నాం.. హైదరాబాద్ పర్యావరణ సుస్థిరతకుగానూ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టినట్టు తెలిపారు.గ్రామాల్లోనూ అత్యుత్తమ వసతులు కల్పిస్తాం.. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా ఇస్తున్నాం... రైతులకు ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా ఇస్తున్నాం.. భూమి లేని కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నాం.. పంటలకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం.. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని అన్నారు. రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాం.. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. ప్రతీ ఇంటికి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఇస్తున్నామని అన్నారు. ప్రతీ సంవత్సరం నాలుగు లక్షల ఇళ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. 20 లక్షల పేద కుటుంబాలు సొంత ఇళ్ల కల నెరవేరుతుందని నేను హామీ ఇస్తున్నా అని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# సీఎం పదవికి ఆతిశీ రాజీనామా

మొదటి పేజీ తరువాయి...

అంటూ సీఎంగా ఆతిశీని ప్రతిపాదించారు. దీంతో ఆమె అనూహ్యంగా ఆతిశీ సీఎం పదవిని చేపట్టారు. ఈ ఎన్నికల్లో ఆప్ అధినేత కేజ్రీవాల్ సహా అగ్రనేతలు మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్ ఓటమి పాలయ్యారు. ముఖ్యమంత్రి ఆతిశీ మాత్రం కాల్‌కాజీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఒకదశలో వెనుకంజలో ఉన్న ఆమె ఆ తర్వాత పుంజుకుని బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరిపై 3,521 ఓట్ల ఆధిక్యంతో నెగ్గారు.

### దిల్లీ సీఎం ప్రమాణస్వీకారం అప్పుడే

ఇక దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ, సీఎం అభ్యర్థిగా ఎవరని నిర్ణయిస్తుందా అనే ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం దిల్లీ సీఎం రేసులో మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఆ తర్వాత బీజేపీ మాజీ అధ్యక్షులైన విజేందర్ గుప్తా, సతీశ్ ఉపాధ్యాయ్, దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ, జాతీయ కార్యదర్శి దుష్యంత్ గౌతమ్‌తో పాటు బీజేపీ ఎంపీ బన్సూరీ స్వరాజ్ పేర్లు ముఖ్యమంత్రి రేసులో ఉన్నాయి. అయితే, పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది. మరోవైపు ప్రధాని మోదీ ఈ నెల 10 నుంచి ఫ్రాన్స్, అమెరికా పర్యటనలకు వెళ్లనున్నారు. ఆయన తిరిగి వచ్చాకనే ప్రమాణ స్వీకారం ఉంటుందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## పల్నాడు జిల్లాలో
# ఘోర ప్రమాదం

### ట్రాక్టర్ బోల్తాపడి నలుగురు మహిళలు మృతి

**ముప్పాళ్ల, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):** పల్నాడు జిల్లాలో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముప్పాళ్ల మండలంలోని బొల్లవరం పరిధిలోని మాదల మేజర్ కాలవ కట్టపై ట్రాక్టర్ బోల్తా పడి నలుగురు మహిళా కూలీలు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ముప్పాళ్ల మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన మహిళా కూలీలు మిరపకోతలకు వెళ్లి తిరిగి గ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది ట్రాక్టర్ బోల్తా పడటంతో మధిర సామ్రాజ్యం (50 ) మధిర గంగమ్మ (55 ), చక్కెర మాధవి( 30) తేనెపల్లి పద్మావతి (45 )అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రాక్టర్ ప్రమాద ఘటనపై రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మహిళా కూలీల మృతి బాధాకరమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలందించాలని అధికారులను ఆదేశించారు.

## తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల కేసు..
# నేడు సుప్రీంలో విచారణ

మొదటి పేజీ తరువాయి...



వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ విచారణ నడుస్తోంది. ఈ క్రమంలో.. ఈ రెండు పిటిషన్లను కలిపి 10వ తేదీన విచారణ చేస్తామని ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. బీఆర్ఎస్ పార్టీ మీద గెలిచిన ఎమ్మెల్యేలు శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాష్ గౌడ్,అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి , సంజయ్ కుమార్‌లు కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించిన సంగతి తెలిసిందే. వీళ్లపై అనర్హత వేటు వేయాలని కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు.

### మరో పిటిషన్‌లో..

ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సహ పలువురు స్పెషల్ లీవ్ పిటిషన్(%ూూూ%) వేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ గవాయ్, అగస్టిన్ జార్జ్ మసీహ్లతో కూడిన ధర్మాసనం ఆ పిటిషన్‌ను శుక్రవారం(జనవరి 31న) విచారణ జరిపింది. ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని కిందటి ఏడాది మార్చి తెలంగాణ హైకోర్టు ఆదేశించిందని, అయితే కోర్టు ఆదేశాలను తెలంగాణ స్పీకర్ ధిక్కరించారని, కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదని పాడి కౌశిక్‌రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే.. సంబంధిత ఎమ్మెల్యేలకు ఇప్పటికే స్పీకర్ నోటీసులు జారీ చేశారని అసెంబ్లీ సెక్రటరీ, తెలంగాణ స్పీకర్ తరఫున సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. ఫిరాయింపుల వ్యవహారాల్లో స్పీకర్ తొందరపాటు నిర్ణయాలు సరికాదని గతంలో సుప్రీం కోర్టు చెప్పడాన్ని ఆయన బెంచ్ ముందు ప్రస్తావించారు. కాబట్టి, స్పీకర్ నిర్ణయానికి తగు సమయం కావాలని ఆయన కోరారు. అయితే.. ఇంకెంత కాలం ఎదురుచూస్తారని, మహారాష్ట్రలో లాగా ఎమ్మెల్యేల పదవికాలం అయ్యేదాకా ఎదురు చూస్తారా? అని సుప్రీం కోర్టు తెలంగాణ స్పీకర్‌పై అసహనం వ్యక్తం చేసింది. దీంతో స్పీకర్ అడిగి చెప్తానని లాయర్ రోహత్గి చెప్పడంతో విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. రేపు (ఫిబ్రవరి 10న) కౌశిక్ రెడ్డి ఎస్ఎల్‌పీ, కేటీఆర్ రిట్ పిటిషన్‌లను కలిపి సుప్రీం కోర్టు విచారణ జరపనుంది.





## తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో
# నలుగురి అరెస్ట్?

తిరుపతి, ఫిబ్రవరి9 (ప్రభాత ఉదయం): తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై సీబీఐ చేపట్టిన విచారణలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం.. నెయ్యి సరఫరా చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. తమిళనాడకు చెందిన ఏఆర్ డెయిరీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పరాగ్ డెయిరీ, ప్రీమీయర్ అగ్రి ఫుడ్స్, ఆల్ఫా మిల్క్ ఫుడ్స్ సంస్థలకు సంబంధించిన కీలక వ్యక్తులను 3రోజులుగా తిరుపతిలో విచారిస్తోంది. విచారణకు సహకరించకపోవడంతో పాటు కల్తీ నెయ్యి ఘటనలో వారి ప్రమేయం ఉన్నట్టు ప్రాథమిక ఆధారాలు లభ్యం కావడంతో ఆదివారం అదుపులోకి తీసుకుంది. తిరుమల శ్రీవారి లడ్డు తయారీకి కల్తీ నెయ్యి వినియోగంపై సీబీఐ నేతృత్వంలో సాగుతున్న దర్యాప్తు కీలకదశకు చేరింది. శ్రీవారి లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతు కళేబరాల అవశేషాలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మారిన వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ కోరుతూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ నేతృత్వంలో పూర్తిస్థాయి విచారణకు ప్రత్యేక బృందం ఏర్పాటైంది. సీబీఐ హైదరాబాద్ డివిజన్ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు, విశాఖ సీబీఐ ఎస్పీ మురళీరాంబతో పాటు రాష్ట్రం నుంచి విశాఖ డీఐజీ గోపినాథ్ జెట్టి, గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారి సత్యకుమార్ ఆధ్వర్యంలో విచారణ సాగుతోంది. గతేడాది నవంబర్‌లో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం పలు దఫాలుగా విచారణ నిర్వహించింది. ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం సభ్యులు తిరుమల, తిరుపతితో పాటు నెయ్యి సరఫరా చేసిన తమిళనాడులోని దుండిగల్ ప్రాంతంలో ఉన్న ఏఆర్ డైయిరీలో విచారణ నిర్వహించారు. మూడు రోజులుగా దర్యాప్తు బృందం సభ్యుడు సీబీఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు తిరుపతిలో మకాం వేసి దర్యాప్తును కొనసాగిస్తున్నారు. నెయ్యి సరఫరాకు తితిదేతో ఒప్పందం చేసుకున్న ఏఆర్ డైయిరీ పలు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఉత్పత్తి సామర్థ్యానికి మించి ఎక్కువ మొత్తంలో సరఫరా చేయడానికి ఉత్తరాదికి చెందిన పలు డైయిరీ సంస్థల నుంచి నెయ్యి కొనుగోలు చేసినట్లు గుర్తించిన సీబీఐ బృందం ఏఆర్ డైయిరీకి సహకరించిన సంస్థల ప్రతినిధులను అదుపులోకి తీసుకుని విచారించింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్, పరాగ్ డైయిరీ, ఆల్ఫా మిల్క్ ఫుడ్స్, ఏఆర్ డైయిరీకి సంబంధించిన విపిన్ గుప్త, పోమిల్ జైన్, అపూర్వ చావడ, రాజశేఖర్‌లను తాజాగా అదుపులోకి తీసుకుంది. సోమవారం వీరిని కోర్టులో హాజరుపరిచే అవకాశముంది.

# భారీ మెజార్టీలకు కేరాఫ్ అడ్రెస్

### కేజ్రీని ఓడించిన పర్వేశ్‌కే దిల్లీ పీఠం!
### దిల్లీ రాజకీయాల్లో చర్చనీయాశంగా పర్వేశ్ సింగ్
### ముఖ్యమంత్రి రేసులో ఆయనే టాప్‌లో!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):** మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేజ్రీవాల్‌నే ఓడించిన బీజేపీ నేత పర్వేశ్ సింగ్ పేరు ప్రస్తుతం దిల్లీ రాజకీయాల్లో చర్చనీయాంశం అవుతోంది. తదుపరి ముఖ్యమంత్రి రేసులో ఆయన పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో ఒకసారి ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ఎన్నికైన పర్వేశ్ రాజకీయ, కుటుంబ నేపథ్యం ఏమిటో ఇప్పుడు చూద్దాం.

### రాజకీయాలకు కొత్తేం కాదు

27 ఏళ్ల తర్వాత దిల్లీలో జయభేరి మోగించిన కమలదళం, ఇప్పుడు ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై దృష్టి సారించింది. ముఖ్యమంత్రి పదవి రేసులో పర్వేశ్ వర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. న్యూదిల్లీ నియోజకవర్గంలో 30వేల 88 ఓట్లు సాధించిన పర్వేశ్ వర్మ మాజీ సీఎం కేజ్రీవాల్‌పై 4వేల 89 ఓట్ల తేడాతో గెలుపొందారు. వర్మ కుటుంబం రాజకీయాలకు కొత్తదేం కాదు.

### భారీ మెజారిటీలు సాధించే నేతగా!

దిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడే పర్వేశ్ వర్మ. అదే న్యూదిల్లీ నియోజకవర్గంలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ దిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కుమారుడు. దీక్షిత్‌కు ఓటమి తప్పలేదు. పర్వేశ్ వర్మ దిల్లీ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటారు. 2013లో ఆయన తొలిసారి మహరోలీ శాసనసభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ దిల్లీ లోక్‌సభ స్థానంలో 2 లక్షల 68 ఓట్ల తేడాతో సత్తాచాటారు. ఇక 2019లో మళ్లీ పశ్చిమ దిల్లీ నుంచి పోటీ చేసి ఏకంగా 5 లక్షల 78 వేల ఓట్ల భారీ మెజారిటీతో జయకేతనం ఎగరవేశారు. భారీ మెజారిటీలు సాధించే నేతగా బీజేపీలో పర్వేశ్ వర్మకు మంచి పేరుంది.

పర్వేశ్ వర్మ పూర్తి పేరు పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ. ఆయన తండ్రి సాహిబ్ సింగ్ వర్మ 1996 నుంచి 1998 మధ్య దిల్లీ ముఖ్యమంత్రిగా సేవలందించారు. దిల్లీ మాజీ సీఎం మదన్‌లాల్ ఖురానా తర్వాత సాహిబ్ సింగ్ వర్మ ముఖ్యమంత్రి అయ్యారు. 1999లో ఎంపీగా గెలుపొందారు. వాజపేయి ప్రభుత్వంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ రాజకీయాల్లో వచ్చిన పర్వేశ్ ఇప్పుడు సీఎం పదవి రేసులో ముందు నిలిచారు. బీజేపీ అధిష్ఠానం ఆయన పేరును కూడా సీఎం పదవికి పరిశీలిస్తున్నట్లు సమాచారం.

అయితే సీఎం విషయంపై పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ మాట్లాడారు. "మార్పును కోరుకుంటూ బీజేపైపై విశ్వాసం ఉంచి గెలిపించిన దిల్లీ ప్రజలకు నా ధన్యవాదాలు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వంతో కలిసి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అయితే ముఖ్యమంత్రి ఎవరనేది అధిష్ఠానమే నిర్ణయిస్తుంది" అని ఓ జాతీయ మీడియా అడిగిన ప్రశ్నకు పర్వేశ్ సమాధానమిచ్చారు.

## మణిపూర్ సీఎం బీరెన్ సింగ్
# రాజీనామా

మొదటి పేజీ తరువాయి...

సచివాలయంలో భేటీ అయ్యారు. బీజేపీ పెద్దల నుంచి పిలుపు రావడం వల్ల ఆదివారం ఉదయం బీరేన్ సింగ్ హుటాహుటిన దిల్లీకి వెళ్లారు. అక్కడ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. దిల్లీ నుంచి ఇంఫాల్‌కు తిరిగి వచ్చిన వెంటనే బీరేన్ సింగ్ నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు రాజీనామా లేఖను అందించారు. మణిపూర్ అసెంబ్లీ సెషన్‌కు సరిగ్గా ఒకరోజు ముందు ఈ పరిణామం జరగడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

### 'అందుకు గర్విస్తున్నా'

బీరెన్ సింగ్ తన రాజీనామా లేఖలో కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇన్నేళ్ల పాటు మణిపూర్ ప్రజలకు సేవ చేసినందుకు గర్విస్తున్నట్లు చెప్పారు. తనకు ఈ గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు కేంద్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. మణిపూర్ అభివృద్ధి కోసం తన హయాంలో చేపట్టిన చాలా ప్రాజెక్టులకు కేంద్ర సర్కారు నుంచి పూర్తి సహకారం లభించిందన్నారు.

ఫిబ్రవరి 10 నుంచి జరగనున్న మణిపూర్ అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాలన్నీ లేవనెత్తుతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన నేపథ్యంలో బీజేపీ హైకమాండ్ రంగంలోకి దిగి మణిపూర్‌లోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. ఈక్రమంలోనే బీరెన్ సింగ్‌ను దిల్లీకి పిలిపించి, మణిపూర్ హింసాకాండతో ముడిపడిన పలు అంశాలపై ఆయనతో చర్చించింది. ఆ వెంటనే ఆయన ఇంఫాల్‌కు తిరిగొచ్చి రాజీనామా చేయడం గమనార్హం.

దాదాపు రెండేళ్ల పాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మెయితీ, కుకీ తెగల మధ్య ఈ ఘర్షణలు జరిగాయి. 2023 సంవత్సరం మే 3న మొదలైన ఈ ఘర్షణల్లో ఎంతోమంది మాన, ప్రాణాలు నష్టం జరిగింది. దాదాపు 250 మందికిపైగా చనిపోయారు. 65వేల మందికిపైగా నిరాశ్రయులయ్యారు.

## తెలంగాణలో
# తొలి 'జీబీఎస్' మరణం

మొదటి పేజీ తరువాయి...

మండలం సీతారాంపల్లికి చెందిన వివాహిత (25)కు ఐదేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమెకు ఇటీవల కుమార్తె జన్మించింది. కుమార్తె జన్మించిన తర్వాత నెల రోజుల కిందట నరాల నొప్పులతో మహిళ అనారోగ్యం బారిన పడింది. దీంతో కుటుంబ సభ్యులు సిద్దిపేట, హైదరాబాద్‌లోని నిమ్స్, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. ఇలా ఆమె వైద్యానికి రూ.లక్షలు వెచ్చించారు. అయినా ఫలితం లేకుండాపోయింది. చివరికి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలోని పుణెలో జీబీఎస్ కారణంగా పలువురు మృతి చెందారు. ఇప్పటికే చాలా మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ వ్యాధితో మరణం సంభవించడం ఇదే మొదటిదని వైద్యులు తెలిపారు.

# ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన ట్రక్కు.. 41 మంది దుర్మరణం

మొదటి పేజీ తరువాయి...

బస్సులో మొత్తం 48 మంది ప్రయాణికులు ఉన్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై టాబాస్కోలోని కమల్‌కాల్కో మేయర్ ఒవిడియో పెరాల్టా స్పందించారు. ప్రమాద ఘటన తీవ్ర విచారకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు చెప్పారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు స్పీడ్ లిమిట్‌లోనే, ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదన్నారు.

# ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



ఉచిత మెఘా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మైలార్ దేవు పల్లి డివిజన్ కార్పో రేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్, సామ ఇంద్రపాల్ రెడ్డి,తదితరులు




సీపీఆర్ శిక్షణ పొందుతున్న కాంగ్రెస్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి

## కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, ఫిబ్రవరి9(ప్రభాత ఉదయం): శివరాంపల్లి ప్రజా పొదుపు సంఘం లో ఆదివారం జనతా హృదయ ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం, ప్రాథమిక లైఫ్ సపోర్ట్ స్కిల్స్ లో భాగమైనన సీపీఆర్ చేయడం ఎలా అనే దానిపై శిక్షణ ఇచ్చారు. కేర్ హాస్పిటల్ లో హృదయ సంబందిత నిపుణులు డాక్టర్ మల్ రెడ్డి హనుమంత్ రెడ్డి, డాక్టర్ ఎం. మేధిని రెడ్డి ఆద్వర్యంలోని డాక్టర్ల బృందం వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జనతా హృదయ ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బీపీ, షుగర్, హెచ్బీఏవన్సీ, కొలెస్ట్రాల్, ఈసీజీ, 2డీఎకో కార్డియోగ్రామ్. పిజిషియన్ డెర్మాటాలజిస్ట్, కార్డియాలజిస్ట్ కన్సలేషన్ చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వారందరికి మనిషి ఏదైన జరిగి క్రింద పడిపోయి స్పృహ కోల్పోతే మొదటగా చేసే సీపీఆర్ గురించి అవగాహన కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు వేల మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ మల్ రెడ్డి హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతమైన జీవితాన్ని జీవించడానికి కృషి చేయాలన్నారు. ప్రతి రోజు ఉదయం వాకింగ్ చేయడం చాలా మంచిదన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శివరాంపల్లి ప్రజా పొదుపు సంఘం నిర్వాహకులు మల్లెల శ్రీనివాస్ రెడ్డి, కొత్త శ్రీరాంరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి , మదుసూదన్, హరికిషన్ జీ, రణధీర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి , శివరాంపల్లి బస్తీకి చెందిన పెండ్యాల చంద్రమోహన్, ఆర్ యాదిరెడ్డి, శాగ ప్రతాప్ రెడ్డి, గుమ్మడి రాంచంద్రారెడ్డి, పడమటి శ్రీదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వర్కాల చందు దంపతులు

## ఘనంగా వర్కాల చందు-రాధికల 11వ వివాహా వార్షికోత్సవం

బుద్వేల్, ఫిబ్రవరి 9(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ వాస్తవ్యులు, సీనియర్ పాత్రికేయులు వర్కాల చందు - రాధిక ల 11వ వివాహా వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్కాల చందు దంపతులకు కుటుంబ సభ్యులు, బందువులు, స్నేహితులు, సహచర పాత్రికేయులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరువురు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థిస్తున్నామన్నారు.



ఉప్పర్‌పల్లిలో సమావేశమైన వివిధ వర్గాలకు చెందిన ప్రజలు

## ఉప్పర్ పల్లిలో హరిహర పుత్ర శ్రీ అయ్యప్ప స్వామీ దేవాలయ నిర్మాణానికి త్వరలో భూమి పూజ

బుద్వేల్, ఫిబ్రవరి9(ప్రభాత ఉదయం): ఉప్పర్‌పల్లిలో హరి హర పుత్ర అయ్యప్ప స్వామీ దేవాలయం నిర్మాణం చేయడానికి స్థానిక శ్రీ వీరాంజనేయ భక్త సమాజం సభ్యులు ఆదివారం తీర్మాణం చేశారు. అందుకోసం ఈ నెల 21, 22, 23వ తేదీలలో పూజా కార్యక్రమాలను నిర్వహిం చాలని నిర్ణయించారు. బస్తీలోని అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు శ్రీ అయ్యప్ప స్వామీ దేవాలయ నిర్మాణానికి సహకరించాలన్నారు.



లగ్న పత్రిక రాసుకున్న స్థానిక భక్తులు



బీఆర్ఎస్ లో చేరిన పలువురు యువకులు

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

బుద్వేల్, ఫిబ్రవరి 9(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలర్ దేవ్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నుండి పలువురు నాయకులు కార్యకర్తలు ఆదివారం బీ ఆర్ ఎస్ పార్టీలో చేరారు. రాజేంద్రనగర్ నియోజక వర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. కార్యక్రమంలో ఎం ఈశ్వర్, వై .వెంకటేష్, రాము యాదవ్, రఘుయాదవ్, వెంకటేష్ కురుమ, సోమ శ్రీనివాస్, అరుణ్ ముదిరాజ్, డి రమేష్, జి రాజు, మంచర్ల చిరంజీవి,, సురేష్ ముదిరాజ్, గంజి రాజు,భాస్కర్ నేత , ఎం రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.



శంషాబాద్ లోని మల్లికా గార్డెన్ లో జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకల్లో నూతన వధూవరులను ఆశీర్వదించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



ఆదివారం వేకువ జామున తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్.
- బుద్వేల్, ప్రభాత ఉదయం.



డి. గోపాలకృష్ణను అభినందిస్తున్న పోలీసు అదికారులు

## పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో రెండు పతకాలు సాదించిన డి.గోపాల క్రిష్ణ

బుద్వేల్, ఫిబ్రవరి9(ప్రభాత ఉదయం) : జనవరి 28 నుంచి ఫిబ్రవరి మొదటి తేదీ వరకు కరీం నగర్ లో జరిగిన 3వ తెలంగాణ స్టేట్ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2025లో రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న డి.గోపాల క్రిష్ణ రెండు బహుమతులను గెలుచుకున్నారు. ఆయనను రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ కె. క్యాస్ట్రో, అతాపూర్ ఇన్స్పెక్టర్ టి. వెంకట్రామిరెడ్డిలు అభినందించారు. డి.గోపాల క్రిష్ణ 84కేజీ ల విభాగం కరాటే పోటీలలో సిల్వర్ మెడల్, తైక్వాండో అండర్ 80 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ లు సాదించారు.



## ఆలయ అభివృద్ధికి విరాళం అందజేసిన రాయచూరు జిల్లా వాసి

కేటిదొడ్డి, ఫిబ్రవరి 9(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంట శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి రాయచూరు జిల్లాకు చెందిన పాండునాయక్ రూ.50 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. ముందుగా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

## సెలూన్స్ చైర్స్ తయారీ పరిశ్రమ, గోదాములో అగ్ని ప్రమాదం

బుద్వేల్, ఫిబ్రవరి9 (ప్రభాత ఉదయం): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం మద్యాహ్నం కాటేదాన్‌లో గల రింకూ జైన్ కు చెందిన ఆర్ కే బ్యూటీ కాన్సెప్ట్ సెలూన్స్ చైర్స్ మ్యానుఫాక్షరింగ్ గోదాములో అగ్ని ప్రమాదం సంబవించింది. గోదాములో పనిచేస్తున్న వాచ్మెన్ మద్యాహ్నం టీ చేసుకోంటుండగా విద్యుత్ ఓవర్ లోడ్ అయి షార్ట్ సర్క్యూట్ జరిగిందని చెబుతున్నారు. దీంతో వాచ్మెన్ మంటలను గమనించి బయటకు పరుగులు తీశారు. మంటలు పెద్ద ఎత్తున ఎగిసి పడ్డాయి. స్థానికులు ఫైర్ స్టేషన్ కు ఫోన్ చేయగా రాజేంద్రనగర్ అగ్ని మాపక శాఖ కు చెందిన ఫైర్ ఆఫీసర్ చంద్ర నాయక్ వెంటనే ఫైర్ ఇంజన్ తో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. మంటలు తీవ్ర స్థాయిలో ఉండటం తో చందులాల్ బారాదారి. లంగర్ హౌజ్, చాంద్రాయణగుట్ట ప్రాంతాలకు చెందిన ఐదు ఫైర్ ఇం జన్ల చే మంటలను ఆర్పివేశారు. మంటలను ఆర్పడానికి మైలార్దేవుపల్లి వాటర్ వర్క్స్ నుంచి మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ డివిజన్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ సాయిలక్ష్మి, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఖాజా జోహర్ లు వెంటనే స్పందించి నీటి ట్యాంకర్లను పంపించారు. మద్యాహ్నం ఒంటి గంటల నుంచి మూడు గంటల వరకు మంటలు ఎగిసిపడుతునే ఉన్నాయి. పెద్ద ఎత్తున నష్టం వాటిల్లి ఉంటుందని స్థానికులు అనుకుంటున్నారు. కేసును మైలారేవుపల్లి పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కాటేదన్‌లో అగ్ని ప్రమాదం జరిగిన ఆర్ కే బ్యూటీ కాన్సెప్ట్ సెలూన్ చైర్స్ పరిశ్రమ




మంటలు ఆర్పడానికి వచ్చిన నీటి ట్యాంకర్లు

## కాటేదాన్ టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీలో ఆగని అక్రమణలు

బుద్వేల్, ఫిబ్రవరి9 (ప్రభాత ఉదయం): కాటేదాన్ లోని టీఎన్జీవోస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సోసైటీ లో ఉద్యోగులకు కేటాయించిన ప్లాట్లు, ఖాళీ స్థలాలను స్థానికంగా పలుకుబడి ఉన్న రాజకీయ పార్టీల నాయకులు ఫోర్జరీ పత్రాలను సృష్టించి కబ్జా చేస్తున్నారు. హౌసింగ్ సోసైటీ స్థలాలను కాపాడాల్సిన సోసైటీ కి పాలక వర్గం లేకపోవడంతో కబ్జాదారులు ఆడింది ఆట పాడింది పాటగా తయారైంది. సోసైటీ కి చెందిన 517 ప్లాట్ లోని 300 వందల గజాల స్థలాన్ని స్థానిక నాయకుడొకరు ఫోర్జరీ పత్రాలను సృష్టించి కబ్జా చేసి ఇతరులకు విక్రయించగా, సదరు ప్లాటు ను యజమాని వారసుల నుంచి కొనుగోలు చేసిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులను మైలారేవుపల్లి పోలీసులు వారం రోజుల క్రితం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిం చారు.

### ఒపెన్ ప్లాటులో దర్జాగా నిర్మాణాలు

టీఎన్జీవోస్ కాలనీలో శ్రీ అయ్యప్ప స్వామీ దేవాలయం సమీపంలో ఖాళీగా ఉన్న 360 గజాల స్థలం పై కన్నేసిన ఓ నాయకుడు 2022 నుంచి దానిని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. సొసైటీ కి చెందిన ఖాళీ స్థలంలో ఇంటి ని నిర్మాణం చేసి కాలనీ కి దూరంగా ఉండే శాంతినగర్ లో షబనా సుల్తాన పేరుతో తీసుకున్న ఇంటి నెంబర్ 8-13-9/3/సీ (పీటీఐ నెంబర్ 1060802867) ను వేశాడు. దీంతో 2022లో టీఎన్జీవోస్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ పేరుతో తమ సొసైటీ స్థలంలో ఇంటిని నిర్మాణం చేసిన వ్యక్తిపై మైలార్ దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో పోలీసులు ఎఫ్ ఐ ఆర్ 405/2022 ప్రకారం కేసు నమోదు చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు సదరు నిర్మాణాన్ని కూల్చివేశారు.



టీఎన్జీవో స్ కాలనీ ఓ పెన్ ప్లాట్‌లో అక్రమ నిర్మాణం

### గత 6నెలలుగా తిరిగి టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ స్థలంలో నిర్మాణాలు :

2022 లో టీఎన్జీవోస్ హౌసింగ్ సోసైటీ ఖాళీ స్థలంలో నిర్మాణం చేసి దానికి శాంతినగర్ కు చెం దిన ఇంటి నెంబర్ వేయడంతో కూల్చివేసిన స్థలంలో సదరు వ్యక్తి తిరిగి ఆరు నెలలుగా నిర్మాణాలు చేపడుతున్నాడు. దీనిపై టీవీన్జీవోస్ హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యుడు రవీందర్ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పిర్యాదు చేశాడు. స్పందించిన అధికారులు కబ్జా జరుగుతున్న స్థలం వద్దకు వచ్చి ప్రహరీగోడను కూల్చి వెళ్లిపోయారు. అయితే సదరు కబ్జాదారుడు టీఎన్జీవోస్ హౌసింగ్ సోసైటీ లో నిర్మించిన ఇల్లు అలానే ఉంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

### సీఎం కలుగచేసుకుని తమకు న్యాయం చేయాలి : సోసైటీ సభ్యులు

1968లో కాటేదాన్ లోని 100 ఎకరాలను టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ ని ఏర్పాటు చేసి ఉద్యోగులకు ఇచ్చారని సభ్యులుగా ఉన్న వారు చెబుతున్నారు. ఆ స్థలంలో చాలా వరకు కబ్జాలకు గురైనాయన్నారు. పార్కు స్థలాలు, ఓపెన్ ప్లాట్లు, కమ్యూనిటీ స్థలాలు బడా నాయకులు కబ్జా చేసి కోట్లాది రూపాయలను సంపాదించుకున్నారని గుర్తు చేస్తున్నారు. ప్రస్థుతం ఉన్న స్థలాలనైన కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రా పేరుతో ఎన్నో భూములను కాపాడుతున్న ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హౌసింగ్ సొసైటీ కి ప్రస్తుతం ఉన్న సభ్యులతో ఒక పాలకమండలి ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.




## శ్రీభవాని మాత చండీయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

కొత్తకోట, ఫిబ్రవరి 9(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో భవాని మాత దేవాలయంలో చండీయాగం లో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొని అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## రహదారుల అభివృద్ధి కోసం కృషి చేస్తా: ఎమ్మెల్యే జిఎంఆర్

మదనాపురం, ఫిబ్రవరి 9(ప్రభాత ఉదయం) నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రోడ్లను అభివృద్ధి చేసి రవాణా సౌకర్యం పెంపొందించేందుకు కృషి చేస్తానని దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు గవినోళ్ళ మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని మదనాపురం మండలం అగ్రహారం (గోవిందహళ్లి) గ్రామంలో నూతన బీటీ రోడ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జియంఆర్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతన వదూ వరులతో మాజీ జెడ్పిటిసి పద్మా వెంకటేశ్వర్ రెడ్డి

## నూతన వధూ వరులను ఆశీర్వదించిన ధరూర్ మాజీ జెడ్పీటిసి పద్మా వెంకటేశ్వర రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి9(ప్రభాత ఉదయం)ధరూర్ మండలం ఉప్పేర్ గ్రామంలో భగవంతు కూతురు శిల్ప రిసెప్షన్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిసెప్షన్ వేడుకలకు ధరూర్ మాజీ జెడ్పీటిసి పద్మా వెంకటేశ్వర రెడ్డి హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు.



ఘనంగా ప్రారంభమైన శ్రీ అంబా భవాని నూతన శిఖర, గరుడ స్తంభ , కలశ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు

## వేడుకల్లో పాల్గొన్న మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి దంపతులు

కొత్తకోట, ఫిబ్రవరి 9(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణ కేంద్రం లోనిశ్రీ అంబా భవాని దేవాలయం లో ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం శ్రీ అంబా భవాని నూతన శిఖర, గరుడ స్తంభ , కలశ ప్రతిష్ట మహోత్సవ సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు పొగాకు మహేష్, పొగాకు ప్రసాద్, పొగాకు అనిల్ , కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుకేశిని విశ్వేశ్వర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయమ్మ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రాములు యాదవ్, శ్రీ వేంకటేశ్వర ఐటిఐ కళాశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ గంగాధర్, లింగేశ్వర్, శివ కుమార్ రెడ్డి, బాలయ్య నాయుడు, తిరుపతయ్య గౌడు. బీమా భారతి, భీమ విజయలక్ష్మి , ఎరుమలి నరసింహ, భీమ బాలకృష్ణ, భక్తులు, పెద్దలు, మహిళలు, పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులను మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి దంపతులు సత్కరించారు.

## ఆహారంలో 33శాతం చిరుధాన్యాలను తీసుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవు

### ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ సి అగర్వాల్

మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ సి అగర్వాల్




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తారా సత్యవతి




బుద్వేల్, ఫిబ్రవరి9(బుద్వేల్): చిరుధాన్యాలను 38శాతం అహారంగా ఉపయోగించడం ద్వారా ఆరోగ్యంగా ఉండటమే కాకుండ వ్యాధులు, ఆనారోగ్యం భారి నుంచి దూరంగా ఉండగలుగుతామని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఎడ్యుకేషన్), రాజేంద్రనగర్ లోని నార్మ్ ఇంచార్జి డైరెక్టర్ డాక్టర్ ఆర్ సి అగర్వాల్ అన్నారు. రాజేంద్రనగర్ లో గల భారతీయ చిరుదాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) ఐఐఎంఆర్ గా ఏర్పడి నేటికి 10 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా అదివారం వ్యవస్థాపక దినోత్సవాలను నిర్వహించారు. ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ సీ అగర్వాల్ మాట్లాడుతూ. దేశంలో వ్యవసాయ విద్యారంగంలో నూతన మార్పులు తీసుకురావడానికి కృషి జరుగుతోందన్నారు. ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారాసత్యవతి మాట్లాడుతూ, 1958 లో ఫీర్కమ్ గా ఏర్పాటైన ఈ సంస్థ 2014 లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ గా పేరు మార్చుకుని ప్రపంచ వ్యాప్తంగా చిరుదాన్యాల ప్రామ ఖ్యతను గురించి తెలియజేయడంలో ముందుకు సాగుతుందన్నారు. చిరుదాన్యాలను పండించే రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను సంస్థ ద్వారా చేపడుతున్నామన్నారు. వారికి శిక్షణ, అవగాహన, మార్కెటింగ్ తదితర విషయాలపై అవగాహన పెంపొందించి ఆర్థికంగా లాభపడేం దుకు చొరవ తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీఐసీఐ బ్యాంకు జోనల్ మేనేజర్ అసీఫ్ ఇక్బాల్ మాట్లాడుతూ, 2025వ సంవత్సరం నుంచి పరిశోధనా సంస్థల నుంచి రైతులకు చిరుదాన్యాలు అదనపు విలువలు, సాంకేతిక పరిజ్ఞానమును అందుబాటులో ఉం చడానికి పథకాలను రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ మదుసూదన్ చిరుధాన్యాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. సంస్థ ఆడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు




నూతన వధూవరులను ఆశీర్వదించిన విద్యుత్ ఉద్యోగ సంఘం నేత ఎం భాస్కర్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ సంతోష్ బృందం


## ఘనంగా దొంతుల సాయికుమార్-స్వాతిల వివాహ రిసెప్షన్ వేడుకలు

### నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు

శంషాబాద్, ఫిబ్రవరి 9() బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ కు చెందిన దొంతుల నర్సింగరావు, లలిత దంపతుల కుమారుడు దొంతుల సాయికుమార్, స్వాతి ల వివాహ రిసెప్షన్ వేడుకలు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి లోని ఎం ఎస్ గార్డెన్ లో ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ రిసెప్షన్ వేడుకల్లో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ అభ్యర్థి, మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు అన్నపురెడ్డి భీమార్జున్ రెడ్డి, ఉద్యోగ 1104 సంఘం నేత ఎం భాస్కర్ రెడ్డి, ప్రభాత ఉదయం మేనేజింగ్ డైరెక్టర్ ఎం దామోదర్ రెడ్డి లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు రత్నం, పరబ్రహ్మ మూర్తి, శంకర్ నాయక్, రాజేంద్రనగర్ టిఎన్జీవో నాయకుడు ఎస్ యాదయ్య, తదితరులు ఉన్నారు.




నూతన వధూవరులను ఆశీర్వదించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



నూతన వధూవరులను ఆశీర్వదించిన బిజెపి రాష్ట్ర నాయకులు అన్నపురెడ్డి భీమార్జున్ రెడ్డి

## గృహప్రవేశానికి హాజరైన కార్తీక్ రెడ్డి





శంషాబాద్,ఫిబ్రవరి 9(ప్రభాత ఉదయం) శంషాబాద్ మండల పెద్ద షాపూర్ మాజీ సర్పంచ్ దేవులపల్లి సత్యనారాయణ గౌడ్ గృహప్రవేశ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరై కుటుంబ సభ్యులను శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసిబి డైరెక్టర్ బుర్కుంట సతీష్. లీగల్ సెల్ నాయకుడు కొనమల్ల శ్రీనివాస్. శంషాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ మంచర్ల మోహన్ రావు ,ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా. బిఆర్ఎస్ పార్టీ నాయకులు జిల్లా శ్రీనివాస్. పరంధాములు. చౌదర్ గూడ బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ కోమ్మ గోపాల్ నర్కుడ బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ మహేష్ యాదవ్. వైస్ ప్రెసిడెంట్ లింగం. శ్రీశైలం. పాల్గొనడం జరిగింది.



## వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)గద్వాల పట్టణం కుంటవీదిలో గల శ్రీశ్రీశ్రీ కంఠేశ్వర శివాలయం వద్ద ఆదివారం పార్వతీ పరమేశ్వర కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉమామహేశ్వర 46వ సంవత్సర కళ్యాణ మహోత్సవ సందర్భంగా ఆలయ అర్చకులు ఆదివారం ఉదయం 11.30 గంటల నుండి 11.45 గంటల వరకు ఆరుద్రనక్షత్రయుక్త మేష లగ్నంలో పార్వతీ పరమేశ్వరలకు ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కళ్యాణోత్సవంలో భాగంగా రాత్రి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించారు.

శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వర 46 వ సంవత్సర కళ్యాణ మహోత్సవం సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ శివుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా స్వామి వారిని కోరుకున్నారు. ఆమె వెంటా జమ్ములమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్ మధుమతి, యువ నాయకులు పవన్ యాదవ్, పూడూరు పాండు తదితరులు పాల్గొన్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608